క్లుప్తంగా

ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

రేగిడి: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. సచివాలయాలకు వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, ఈఓపీఆర్డీ నాగభూషణరావు, ఏపీఓ ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాగిజావ పంపిణీ



మునకలవలసలో రాగి పిండిని పంపిణీ చేస్తున్న ఎంఈఓ

రేగిడి: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నుంచి విద్యార్థులకు పోషకాలతో కూడిన రాగి జావను అందించనున్నట్లు ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు తెలిపారు. మండలంలోని మునకవలస ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 8.45 గంటలకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు(మంగళ, గురు, శనివారం) రాగిజావ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఏసీ చిరంజీవి

రాజాం: మండలంలో శ్యాంపురం సచివాలయం వద్ద వైఎస్సార్ క్రాంతిపథకం ఆధ్వర్యంలో పోషకాహారంపై చిన్నారుల తల్లిదండ్రులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి మాట్లాడుతూ.. 6 నెలల నుంచి 72 నెలలు మధ్య పిల్లల పెరుగుదలకు చిరుధాన్యాలు, పప్పుదినుసులు, ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు, చేపలు, డ్రైఫ్రూట్స్ ఆహారంగా ఇవ్వాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శారీరానికి వ్యాధినిరోధక శక్తి లభిస్తుందన్నారు. బిడ్డకు ఆరు నెలల నిండగానే తల్లి పాలతో పాటు అనుబంధ పోషకాహారం అందివ్వాలన్నారు. నిర్ణీత సమయానికి టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ ఏపీఎం కె.హేమలత, కమ్యునిటీ కోఆర్డినేటర్ జ్యోతి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీసర్వేను వేగవంతం చేయండి



సర్వే బృందానికి సూచనలిస్తున్న తహసీల్దార్ బాలమురళీకృష్ణ

బాడంగి: మండలంలో జరుగుతున్న భూముల రీసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ సర్వే బృందాన్ని ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సర్వే బృందం, ఇతర అధికారులతో సమావేశమైన ఆయన మండలంలోని వాడాడ, కోడూరు, పాల్తేరు గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 22 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తి చేశామన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ఏర్పాటు దగ్గర ఎంపీడీఓ రమామణి, సర్పంచ్ ఈశ్వరరావు

రామభద్రపురం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎంపీడీఓ రమామణి, సర్పంచ్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవికాలం దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రయాణికులు, పాదచారులు, వాహనదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య సిరులు



బాడంగి: మిల్లెట్స్‌తో వంటకాలు తయారు చేసిన వారికి బహుమతులు అందించేందుకు సిద్ధంగా ఉన్న తహసీల్దార్ బాలమురళీకృష్ణ, అధికారులు

అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవం పురస్కరించుకుని, బొబ్బిలి, రాజాం మండల కేంద్రాల్లో జరిగిన చిరుధాన్యాల వంటకాల ప్రదర్శన ఆకట్టుకుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని, వంటకాలు రుచి చూశారు. బాగా వండిన వంటకాలకు బహుమతులు ప్రదానం చేశారు. చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాలు తిని, ఆరోగ్యవంతులుగా జీవించాలని వక్తలు పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం: చిరుధాన్యాలతో చేసిన వంటలను పరిశీలిస్తున్న అధికారులు



సంతకవిటి: విజేతలకు బహుమతులు అందిస్తున్న తహసీల్దార్ సులోచనారాణి



తెర్లాం: వెలుగు కార్యాలయంలో చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అప్పారావు



వంగర: చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



బొబ్బిలి రూరల్: చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాల ప్రదర్శన

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



తెర్లాం: వి.చిన్నయ్యపేట గ్రామంలో పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న ఏహెచ్‌ఏలు

తెర్లాం: పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని వి.చిన్నయ్యపేట, రాజయ్యపేట గ్రామాల్లో చేపట్టిన టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన ఈ సీజన్‌లో పశువులు ఎక్కువగా గాలికుంటు వ్యాధి బారినపడి చనిపోయే ప్రమాదం ఉందన్నారు. పశువుల కాళ్ల గిట్టల మధ్య పుండ్లు, నోటి వెంబడి చొంగ రావడం, అధిక జ్వరం వంటివి వ్యాధి లక్షణాలు అని ఇవి కనిపించిన వెంటనే పాడి రైతులు దగ్గరలోని పశువుల ఆస్పత్రికి పశువులను తరలించి, చికిత్స అందజేయాలన్నారు. నాలుగు నెలల వయసు దాటిన పశువులన్నింటికీ టీకాలు వేస్తున్నామన్నారు.

క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలి



అవగాహన ర్యాలీలో అధికారులు, వైద్య సిబ్బంది

తెర్లాం: క్షయవ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పెరుమాళి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.మాధవి, బాడంగి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ బి.రమేష్ కోరారు. మండలంలోని పెరుమాళి, కాగాం గ్రామాల్లో క్షయవ్యాధి నివారణపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, కఫంలో రక్తజీర, రాత్రిపూట జ్వరం, ఆహారం తినడానికి ఇష్టంలేక పోయినా, బరువు తగ్గినా క్షయవ్యాధి కావచ్చని, అటువంటి లక్షణాలున్న వ్యక్తులు స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి, వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయవ్యాధి నివారణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని, వ్యాధిగ్రస్తులు భయపడాల్సిన పనిలేదన్నారు. వ్యాధిగ్రస్తులకు 6 నెలల పాటు పౌష్టికాహారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం గ్రామంలో క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గ్రోత్ సెంటర్‌లో క్షయ వ్యాధి నివారణపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బొబ్బిలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ ఆర్.శ్రీదేవి టీబీ లక్షణాలు, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధిగ్రస్తులు భయపడొద్దని, జాగ్రత్తలు పాటిస్తే అదే తగ్గిపోతుందన్నారు. రోగుల మందుల నిమిత్తం రూ.500 బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు.

వారానికి మూడురోజులు రాగిజావ

తెర్లాం: మండలంలోని 66 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 4,693 మంది విద్యార్థులకు మంగళవారం నుంచి రాగిజావ పంపిణీ చేయనున్నట్లు మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీకి సంబంధించి, జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం పరిశీలించిన ఆయన జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు వారానికి మూడు రోజుల పాటు రాగిజావ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుందన్నారు. ప్రతీ మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు స్థానికంగా ఉండే పాఠశాల విద్యాకమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వ గ్లాసులు పంపిణీ చేసేంత వరకు విద్యార్థులు తమ ఇంటి నుంచి గ్లాసులు తెచ్చుకోవాలన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం నుంచి రాగిజావ పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ సీహెచ్

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందిస్తున్న ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు

మెంటాడ: మండలంలో మరో(అదనంగా) విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడంతో పాటు రెగ్యులర్ ఎలక్ట్రికల్ ఏఈని నియమించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా మండల కేంద్రంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మండలంలో ప్రస్తుతం ఇద్దనవలస గ్రామంలో సబ్‌స్టేషన్ ఉందని, మండలంలోని 30 గ్రామ పంచాయతీలతో పాటు 60 గ్రామాలున్నాయని వాటి అవసరాలకు సరిపడ విద్యుత్‌ను ఇప్పుడున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ద్వారా అందడం లేదని వివరించారు. ఈ నేపథ్యంలో మరో సబ్‌స్టేషన్ మంజూరు చేసి, నిర్మించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సారికి ఈశ్వరరావు, జయితి శివాలయం చైర్మన్ జి.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

200 ఎకరాల్లో మొక్కజొన్న పంటనష్టం



శ్యాంపురం వద్ద పంటనష్టాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ దమయంతి

రాజాం: అకాల వర్షాల కారణంగా మండలంలో సుమారు 200 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని వ్యవసాయశాఖ ఏడీ కె.చంద్రరావు అన్నారు. పలు గ్రామాల్లో పంట నష్టాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ఆర్బీకేల సిబ్బందితో పంట నష్టాలపై సమాచారం సేకరించినట్లు చెప్పారు. వారు ఇచ్చిన వివరాల మేరకు 200 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామన్నారు. క్షేత్రస్థాయిలో మరోదఫా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని తెర్లాం మండలానికి చెందిన రెండు మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, నాలుగు ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆమె జె.కొత్తవలస, గోపాలవలస గ్రామాల్లోని మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తల పోస్టులు, బూరిపేట, అరసబలగ, ఆర్.గదబవలస, కాలంరాజుపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన వారంతా ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా తమ కార్యాలయానికి దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట–1, పిరిడి–1, శివడవలస అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు, అక్కేనవలస గ్రామంలోని మినీఅంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ రూరల్ పీఓ విజయలక్ష్మి ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. అర్హులైన వారంతా ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా వరల్డ్ ఓరల్ హెల్త్ డే

బొబ్బిలి రూరల్: మండలంలోని నారాయణప్పవలస గ్రామ ప్రభుత్వ పాఠశాలలో వరల్డ్ ఓరల్ హెల్త్ డే సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిరిడి సీహెచ్‌ఓ సీహెచ్ మాలతి నోటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బ్రష్ చేసుకునే విధానాలను విద్యార్థులకు వివరించారు.

రేపు కళాభారతిలో ఉగాది వేడుకలు

బొబ్బిలి: స్థానిక శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో ఉగాది వేడుకలు బుధవారం నిర్వహించనున్నట్లు కళాభారతి అధ్యక్ష, కార్యదర్శులు సిద్దా సత్యనారాయణ, నంబియార్ వేణుగోపాలరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మరింత రుచిగా జగనన్న గోరుముద్ద



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: జగనన్న గోరుముద్ద భోజనాలు మరింత రుచిగా ఉండాలని ఎంఈఓ వై.దుర్గారావు సూచించారు. మండలంలోని లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం రమణయ్య ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

రాజాం సిటీ: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నామని కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. సోమవారం రాత్రి రేగిడి మండలం సంకిలి నాగావళి నది హెడ్‌వాటర్ షెడ్‌వద్ద తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈనెల 19న పిడుగుపాటుకు గురై ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ పాడైంది. దీన్ని బాగు చేసేంత వరకు పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలికం

సీఎం జగన్‌ను కలిసిన జోగులు

రాజాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో కలిశారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రాజాం ప్రాంత అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం ఉంటుందని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సీఎం జగన్‌తో ఎమ్మెల్యే జోగులు



ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి



వంగర: మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



బొబ్బిలి రూరల్: అధికారులకు సమస్య వివరిస్తున్న మహిళ



బాడంగి: కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రమామణి

వంగర: గ్రామాల్లోని సమస్యలపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల ఉద్యోగులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సచివాలయ స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ లోపింటి త్రినాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: గ్రామ సచివాలయాల వారీగా స్పందనలో వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శుల సమావేశమై పలు సూచనలు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్‌కుమార్‌కు సూచించారు.

బొబ్బిలి రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండగా, పలువురు తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. ఈ క్రమంలో వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎంపీడీఓ అల్లు భాస్కరరావు ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.శ్యామ్‌సుందర్, ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు, హెచ్‌డీటీ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కాగా, ఎటువంటి వినతులు రాలేదని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు ప్రవీణ్ కుమార్, రమేష్, ఏపీఓ విజయకుమారి, ఏపీఎం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంపీడీఓ రమామణి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ప్రతీ సోమవారం చేపట్టే ఈ కార్యక్రమానికి వచ్చి, సమస్యలు వివరించాలని కోరారు. శాఖల వారీగా సంబంధిత అధికారులు వినతిపత్రాలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం



రాజాం: పెనుబాక వద్ద జగనన్న కాలనీలో నిర్మాణాలు

రాజాం: మండలంలో పెనుబాక గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో 52 గృహాలను సామూహిక గృహప్రవేశాలకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ లేఅవుట్‌లో మొత్తం 72 మందికి ఇంటి స్థలాలతో పాటు పట్టాలు అందించారు. వారిలో 52 మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయడంతో సామూహిక గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని లబ్ధిదారులకు సూచించారు.

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు

రేగిడి: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఉంగరాడ మెట్ట, కాగితాపల్లి, వన్నలి, అంబకండి, చాటాయవలస తదితర గ్రామాల్లో నిర్మాణాలు ఊపందుకున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణాలను పర్యవేక్షిస్తున్నారు. లబ్ధిదారులకు కావాల్సిన సామగ్రిని అందించడంతో పాటు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తున్నారు.

బాల్యవివాహాలపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న జెడ్పీటీసీ రామారావు, ప్రిన్సిపాల్ రామదాసు

బాడంగి: స్థానిక గురుకుల పాఠశాలలో బాల్యవివాహాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలకు పాల్పడిన వారు శిక్షార్హులన్నారు. పెళ్లీడు రాకుండా మైనర్లకు వివాహం చేస్తే గర్భధారణ, ప్రసవం సమయంలో సమస్యలు తలెత్తుతాయని, ఇవి తల్లీబిడ్డ ఇద్దరికీ ప్రమాదమేనన్నారు. ఒక్కోసారి ఇద్దరూ చనిపోయే అవకాశం ఉందన్నారు. 21 సంవత్సరాల వయసు వచ్చినంత వరకు ఆడపిల్లలకు పెళ్లి చేయవద్దన్నారు. అనంతరం బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.రామదాసు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు కౌన్సిలింగ్..

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస గ్రామంలో మైనర్లకు వివాహం చేసేందుకు సిద్ధమవుతున్న తల్లిదండ్రులకు అధికారులు సోమవారం కౌన్సిలింగ్ ఇచ్చి, పెళ్లిళ్లు నిలిపివేశారు. ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్లు(16 ఏళ్ల వయసు)కు మే నెలలో వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా, ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ రూరల్ పీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, ఎస్‌ఐ చదలవాడ సత్యనారాయణ గ్రామం చేరుకుని, ఇరు కుటుంబాలకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటికి పాల్పడితే చట్ట ప్రకారం అమలయ్యే శిక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం ఇరు వర్గాలతో వివాహం చేయమని అంగీకార పత్రం రాయించారు. కార్యక్రమంలో సర్పంచ్ పువ్వల మాధవరావు, వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి



ధర్నా చేస్తున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన దేవులపల్లి వెంకటేష్ మృతికి కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మెంటిపేట కాలనీలో సోమవారం నిరవధిక ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయపోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, కేఎన్‌పీఎస్ జిల్లా కన్వీనర్ నల్లబారికి గురుమూర్తి, బీఎస్పీ జిల్లా నాయకులు బి.బుద్దుడు మాట్లాడుతూ రెల్లి కులస్తుడైన వెంకటేష్ హత్యకు కారణమైన వారిని అరెస్టు చేయడంలో సీఐ, ఎస్సైలు కావాలనే జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. హంతకులపై హత్యా నేరంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, కేసు దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎస్.గురువులు, బెలమల ప్రభాకర్, సొండి గౌరీశంకర్, ఎస్.అనసూయమ్మ, దేబారికి రామప్పుడు, రాకోటి రాంబాబు పాల్గొన్నారు.

వాహనాల వేలంతో రూ.లక్ష ఆదాయం



వాహనాల వేలం నిర్వహిస్తున్న ఎస్‌ఈబీ సిబ్బంది

రాజాం సిటీ: ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను సోమవారం స్థానిక ఎస్ఈబీ కార్యాలయం వద్ద వేలం వేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నాలుగు వాహనాలను వేలం వేయగా.. జీఎస్టీతో కలుపుకుని రూ.1,11,510లు ఆదాయం వచ్చిందని సీఐ శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బందితో పాటు పాటదారులు పాల్గొన్నారు.